బతుకులు 'ఆటో' ఇటో..

గాంధారిలో రాస్తారోకో నిర్వహిస్తున్న ఆటో డ్రైవర్లు

- ఆటో డ్రైవర్ల ఆవేదన
- మహాలక్ష్మీ పథకం అమలుతో ఆటోల్లో మహిళలు ప్రయాణించడం లేదని వెల్లడి
- కనీసం డీజిల్, పెట్రోల్‌కు కూడా డబ్బులు వస్తలేవని ఆవేదన
- ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్
- ఎల్లారెడ్డి, గాంధారి మండల కేంద్రాల్లో నిరసన

ఎల్లారెడ్డి తహసీల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్లు

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 14: ఆటోల్లో ప్రయాణికులు ఎక్కకపోవడంతో ఆర్థిక పరిస్థితి దిగజారి తమ కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆటోడ్రైవర్లు అందరూ కలిసి ఎల్లారెడ్డిలో రెవెన్యూ అధికారికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఎల్లారెడ్డి పట్టణంలోని తెలంగాణ తల్లి ప్రాంగణం వద్ద నిరసన తెలిపిన అనంతరం వారు స్థానిక తహసీల్ కార్యాలయానికి చేరుకున్నారు. కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేసి తమ గోడును వెల్లగక్కారు. రాష్ట్రంలో ప్రస్తుతం మహాలక్ష్మీ పథకం అమలు చేయడంతో రోజుకు కనీసం వంద రూపాయలు కూడా సంపాదించలేని దీన స్థితికి చేరుకున్నామని ఆటోడ్రైవర్లు ఆవేదన వ్యక్తంచేశారు. ఆటోలపై ఆధారపడి జీవిస్తున్న తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఆటోడ్రైవర్ల సంఘం అధ్యక్షుడు ఎండీ సాబేర్, ఉపాధ్యక్షుడు రాములు, సంఘ సభ్యులు ఉన్నారు.

గాంధారిలో ఆటో డ్రైవర్ల రాస్తారోకో..

గాంధారి, డిసెంబర్ 14: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ఆటో డ్రైవర్లు ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మీ పథకానికి వ్యతిరేకంగా గాంధారిలోని ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. అంతకు ముందు ఆటో డ్రైవర్లు ప్రధాన రహదారిపై ఆటోలతో ర్యాలీని నిర్వహించారు. అనంతరం స్థానిక నెహ్రూ విగ్రహం వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉపాధి లేక నష్టపోతున్న తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. మండలంలోని ఆయా గ్రామాల ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్ల పంపిణీ

వాలీబాల్ కిట్లను పంపిణీ చేస్తున్న ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు

డోంగ్లీ, డిసెంబర్ 14: మండల కేంద్రంలోని యువకులకు ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు దీన్‌దయాల్ వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. స్థానిక గ్రామ పంచాయతీలో గురువారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన యువకులకు కిట్లను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. క్రీడలతో మానసికోల్లాసం, శారీరక దారుఢ్యం లభిస్తాయని అన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆశీష్, దిగంబర్‌రావు పాటిల్, శంకర్ జాదవ్, యువకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సామగ్రి అందజేత

తమకు అందజేసిన బ్యాగులు, పెన్నులు, నోటు బుక్కులతో విద్యార్థులు

నిజాంసాగర్, డిసెంబర్ 14: గున్కుల్ గ్రామానికి చెందిన కంచిమల్ల ప్రసాద్ ఆర్మీలో జవాన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మండలంలోని గున్కుల్ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 39 మంది విద్యార్థులకు రూ.పది వేల విలువ చేసే స్కూల్ బ్యాగులు, పెన్నులు, నోటు పుస్తకాలను గురువారం అందజేశారు. ప్రసాద్ తమ కుమార్తె పుట్టిన రోజు సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులను అందజేయడం సంతోషంగా ఉన్నదని ప్రధానోపాధ్యాయుడు సంతోష్ తెలిపారు. కార్యక్రమంలో ప్రసాద్ కుటుంబీకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంత్రి సీతక్కను కలిసిన ఎమ్మెల్యే మదన్‌మోహన్

మంత్రి సీతక్కకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్

ఎల్లారెడ్డి, డిసెంబర్ 14: రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను సచివాలయం ప్రాంగణంలో ఎమ్మెల్యే మదన్‌మోహన్ గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఎల్లారెడ్డి నియోజక వర్గానికి అండగా ఉండాలని, పంచాయతీ రాజ్ శాఖ నుంచి అవసరమైన నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరారు.

కూరగాయల సాగుపై రైతులకు అవగాహన

రైతులకు అవగాహన కల్పిస్తున్న రిలయన్స్ ఫౌండేషన్ బాధ్యులు

పిట్లం, డిసెంబర్ 14: మండలంలోని కంభాపూర్ గ్రామంలో రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు కూరగాయల సాగుపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రిలయన్స్ ఫౌండేషన్ జిల్లా అధికారి రాజు మాట్లాడుతూ.. వాతావరణ కాలుష్య పద్ధతులను తగ్గించి పర్యావరణ అనుకూల పద్ధతులను పాటించాలని రైతులకు సూచించారు. వాతావరణ అనుకూల పరిస్థితుల ప్రకారం సేంద్రియ ఎరువులను వాడాలని అన్నారు. సేంద్రియ ఎరువులు పంట అభివృద్ధికి ఏ విధంగా దోహదపడుతాయనే అంశాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో రిలయన్స్ జిల్లా అధికారిణి శ్వేత, సర్పంచ్ కవిత, ఉపసర్పంచ్ సాయి గొండ, పంచాయతీ కార్యదర్శి తుకారాం, ఎల్లారెడ్డి విండో చైర్మన్ సదాశివ, రిలయన్స్ ఫౌండేషన్ సభ్యులు సాయికుమార్, జైల్‌సింగ్, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గౌరారంలో బడిబాట

బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

పిట్లం, డిసెంబర్ 14: మండలంలోని గౌరారం గ్రామంలో సీఆర్పీ గోపాల్, ఉపాధ్యాయులు కలిసి గురువారం బడిబాట నిర్వహించారు. గ్రామంలోని బడి బయటి పిల్లలను గుర్తించి గౌరారం ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. పిల్లలను ప్రతి రోజూ పాఠశాలకు పంపించాలని సూచించారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

తాడ్వాయి, డిసెంబర్ 14: మండలంలోని ఎర్రాపహాడ్ గ్రామంలో పేకాడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు గురువారం తెలిపారు. గ్రామంలోఓ ఇంటి ఆవరణలో పేకాడుతున్నారనే పక్క సమాచారంతో జిల్లా టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, పోలీసులు దాడి చేశారని చెప్పారు. పేకాడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి రూ.58,670 నగదు, 8 సెల్‌ఫోన్లు, రెండు బైక్‌లు, ఒక కారును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కేసు నమోదు చేశామని చెప్పారు. మండలంలో ఎవరైనా పేకాడితే సమాచారం ఇవ్వాలని, పేకాటరాయుళ్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం వద్దు

అంగన్‌వాడీ కేంద్రంలో వండిన ఆహారాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

నిజాంసాగర్, డిసెంబర్ 14: మొక్కల పెంపకం విషయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది నిర్లక్ష్యం వహించ వద్దని జుక్కల్ ఎంపీడీవో నరేశ్ సూచించారు. జుక్కల్ మండలంలోని ఏడ్గి గ్రామంలో నర్సరీ మొక్కల పెంపకాన్ని ఆయన గురువారం పరిశీలించారు. మొక్కలకు ప్రతి రోజూ నీళ్లు పడుతూ రక్షించాలని అన్నారు. అనంతరం పెద్ద గుల్ల గ్రామ అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. కేంద్రంలో బాలింతలు, గర్భిణులు, చిన్నారుల కోసం తయారు చేస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. సమయపాలన పాటిస్తూ.. అంగన్‌వాడీ కేంద్రాన్ని తెరిచి ఉంచాలని సూచించారు. ఆయన వెంట సర్పంచ్ విఠల్‌రావుతోపాటు ఎంపీవో యాదగిరి ఉన్నారు.

భిక్షలో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు

అయ్యప్ప ఆలయంలో మాలధారులకు భిక్ష

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 14: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో గురువారం దీక్షాధారులకు కళ్యాణి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు వీరయ్య భిక్ష ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో దీక్షాధారులు హనుమంతప్ప, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, దేశబోయన సాయిలు, తరుణ్, పంతంగ రాజ్‌కుమార్, గోజె అమృత్ రావు, త్యార్ల సాయిప్రసాద్, మురళి, ప్యాలాల రాములు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

నృత్యం చేస్తున్న అయ్యప్ప మాలధారులు

వైభవంగా అయ్యప్ప ఆరట్టు

పిట్లం, డిసెంబర్ 14: పిట్లంలో అయ్యప్ప మాలధారులు ఆరట్టు ఉత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. స్థానిక అయ్యప్పస్వామి ఆలయం నుంచి ఉత్సవ మూర్తులను ప్రత్యేక రథంపై ఉంచి నృత్యాలు చేస్తూ.. పటాకులు కాలుస్తూ రామాలయం వరకు తీసుకెళ్లారు. అనంతరం అయ్యప్ప ఆలయంలో గురుస్వామి పుట్నాల భగవాన్ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు జగదీశ్, నర్సాగౌడ్, బొడ్లరాజు, ఈశ్వర్‌రెడ్డి, నారాయణరెడ్డి, నరేశ్, వెంకట్‌రెడ్డి, బెజుగం వాసు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల ప్రతిష్ఠాపన

హోమం నిర్వహిస్తున్న భక్తులు

నిజాంసాగర్, డిసెంబర్ 14: మహ్మద్‌నగర్ మండలంలోని బుర్గుల్ గ్రామ శివారులో ఉన్న సాయిబాబా ఆలయంలో గణపతి, దత్తాత్రేయ విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలను గురువారం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు, విగ్రహాల ఊరేగింపు అనంతరం ప్రతిష్ఠాపన చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ దాత బాపురెడ్డి దంపతులతో పాటు భక్తులు పాల్గొన్నారు.